క్లుప్తంగా

శ్యామెల్‌నాయక్‌కు సన్మానం



ములుగు: వంద రోజుల పాటు జాగృతి కళాజాత చేపట్టిన డాక్టర్ శ్యామెల్ నాయక్‌ను గురువారం హైదరాబాద్‌లో జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత శాలువా కప్పి సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా శ్యామెల్ నాయక్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ పార్టీ తరఫున అనేక కార్యక్రమాలను బాధ్యతాయుతంగా నిర్వహించానని గుర్తు చేశారు. ఎస్టీ లంబాడా కులం నుంచి మాజీ మంత్రి జగన్నాయక్, ఎంపీ బలరాంనాయక్‌ల సమక్షంలో సేవా కార్యక్రమాలను చేపడుతూ వస్తున్నానని వెల్లడించారు. సేవా కార్యక్రమాలను చూసి బెంగుళూరు యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను పొందానని వివరించారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని పత్తిపంపల్లి పంచాయతీ పరిధి చింతలపల్లి గ్రామానికి చెందిన ఎనగందుల సురేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ పరామర్శించి సురేశ్ మృత దేహం వద్ద పలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, అర్శం రఘు, అభినయ్‌చారి, తదితరులు ఉన్నారు.

గ్రామ కమిటీల ఎన్నిక

రేగొండ: మండలంలోని జోగయ్యపల్లి, గూడెపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జ్ పున్నం రవి తెలిపారు. జోగయ్యపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అలువాల రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల జోగేందర్, ఉపాధ్యక్షుడిగా మిడిమిల్ల రాజయ్య, కోశాధికారిగా బండి శ్రీనివాస్, గూడెపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పోసాని శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా నూకల సంపత్, ఉపాధ్యక్షుడిగా మోరె కుమార్, కోశాధికారిగా మోరె కిరణ్, యూత్ అధ్యక్షుడిగా ముద్దమల్ల నరేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పట్టెం శంకర్, ఎర్రబెల్లి రవీందర్‌రావు, పున్నం ప్రవీణ్, కొమ్ము రాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చిట్యాల: మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన తిప్పని లక్ష్మి, తీర్థాల సుస్మిత ఇటీవల పలు కారణాలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. దీంతో వారు ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్ గురువారం గోపాలపూర్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఏరుకొండ గణపతి, నాయకులు కుమారస్వామి, మల్లయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వెంకటాపురం (ఎం): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నల్లగుంట శివారులో చోటు చేసుకుంది. ఎస్సై జక్కుల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్ నగర్ చెందిన ప్రశాంత్(28) లక్ష్మీదేవిపేట నుంచి జవహర్‌నగర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నల్లగుంట మలుపు వద్ద అదుపు తప్పి ద్విచక్ర వాహనం పొలాల్లోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని యువకుడు..

భూపాలపల్లి అర్బన్: ఉరేసుకొని యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని టీటు క్వాటర్స్ కాలనీలో నివాసముంటున్న వడ్డే అనిల్(35) పట్టణంలో కారు డ్రైవరుగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంట్లోనే ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి వడ్డే స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

నత్తనడకన షెడ్ల నిర్మాణ పనులు

పిల్లర్ల స్థాయిలోనే క్యూలైన్లపై జీఐ షీట్స్ షెడ్లు
- పట్టించుకోని అధికారులు



పిల్లర్ల దశలో ఉన్న క్యూలైన్లపై షీట్స్ షెడ్ల నిర్మాణం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారంలో క్యూలైన్లపై జీఐ షీట్స్ షెడ్ల నిర్మాణ పనులు నత్తనడక సాగుతున్నాయి. క్యూలైన్లపై భక్తులకు నీడ కోసం శాశ్వతంగా జీఐ షీట్స్ షెడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3.80కోట్ల నిధులను కేటాయించింది. పీఆర్ డిపార్ట్‌మెంట్ శాఖకు ఈ పనులను అప్పగించారు. క్యూలైన్లపై షెడ్ల నిర్మాణం పనులను వచ్చేడాది మహాజాతర నాటికి పూర్తి చేయాలని ఆ శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. టెండర్ ద్వారా పనులను పొందిన సంబంధిత కాంట్రాక్టర్ పనుల్లో వేగం పెంచాల్సి ఉండగా ఆ దిశగా పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం పిలర్ల స్థాయిలోనే నిర్మాణ పనులు సాగుతున్నాయి.

పనుల్లో వేగం పెంచితేనే..

క్యూలైన్లపై జీఐ షీట్స్ షెడ్ల నిర్మాణం పనుల్లో వేగం పెంచితేనే మహాజాతర నాటికి పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు కూడా కాంట్రాక్టర్‌ను పురమయించి పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. క్యూలైన్లపై నిర్మిస్తున్న షెడ్ల నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రమాణాలు కూడా పాటించాల్సిన అవసరం ఉంది. క్యూలైన్లపై షెడ్ల నిర్మాణంతో భక్తులకు మరింత సౌకర్యార్థం కలగనుంది. మహాజాతరకు ఏడు నెలల సమయం ఉంది. డిసెంబర్ నుంచే మేడారానికి భక్తుల తాకిడి పెరుగుతుంది. డిసెంబర్ నెల వరకు పనులను పూర్తి చేస్తే భక్తులకు క్యూలైన్లు అందుబాటులోకి రానున్నాయి. పనుల్లో అలస్యం జరిగితే భక్తులకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు పట్టించుకోవడం లేదని పనుల్లో నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని మేడారం సమ్మక్క-సారాలమ్మ పూజారులు, భక్తులు కోరుతున్నారు.

ఉద్యాన పంటలపై రాయితీ



జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనసూయ

ములుగు రూరల్: ఉద్యానవన పంటల సాగు రైతులకు ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రాయితీ పథకాలను మంజూరు చేసిందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనసూయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్)పథకంలో భాగంగా అరటి, బొప్పాయి, జామ, నిమ్మ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ సాగుకు 40 నుంచి 50శాతం రాయితీ అందిస్తుందని వెల్లడించారు. 61హెక్టార్లకు గాను రూ.22.26లక్షలు మంజూరు అయినట్లు వివరించారు. పూలతోటల సాగుకు 3 హెక్టార్లకు గాను రూ.60 వేలు, మల్చింగ్ విధానంలో కూరగాయల సాగుకు 150 హెక్టార్లకు రూ.30లక్షలు, నీటి కుంటలకు 3 యూనిట్లకు రూ.3లక్షలు, సోలార్ క్రాప్ డ్రైయర్ 8 యూనిట్లకు రూ.8.80లక్షలు, ఉద్యాన యాంత్రీకరణ పరికరాలు 93యూనిట్లకు గాను రూ.24.46లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా శాశ్వత పందిరి కూరగాయల సాగుకు 50యూనిట్లకు రూ.25లక్షలు 50శాతం రాయితీ ఉందని తెలిపారు. డ్రిప్, తుంపర్ల సేద్యం పరికరాలకు 80 నుంచి 100శాతం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ సాగుకు 3వేల ఎకరాలకు మంజూరు వచ్చిందని తదితర పంటల సాగుకు సబ్సిడీ వివరాలను వెల్లడించారు. పూర్తి వివరాలకు ములుగు, వెంకటాపురం(ఎం), మల్లంపల్లి, గోవిందరావుపేట, ఎస్‌ఎస్ తాడ్వాయి మండలాల రైతులు ములుగు ఉద్యాన శాఖ అధికారి శ్రీకాంత్ సెల్ నంబర్ 7780132284లో, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వెంకటాపురం(కె), వాజేడు మండలాలకు చెందిన రైతులు ఉద్యాన శాఖ అధికారి లావణ్య సెల్ నంబర్ 770283263లలో సంప్రదించి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చని వెల్లడించారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు చేరాలని గురువారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కరపత్రాలను ఆవిష్కరించి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈట రేణుక మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏటూరునాగారంలో ప్రథమ సంవత్సరం కోసం అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్‌లను ఉచితంగా చేయించుకోవాలని కోరారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అధునాతనమైన, సాంకేతికమైన విశాలమైన సైన్సు ల్యాబ్‌లు, 250కి పైగా కంప్యూటర్లతో కూడిన విశాలమైన కంప్యూటర్ ల్యాబ్, ఉపాధి కోర్సులతో కూడిన టీఎస్‌కేసీ, టీఏఎస్‌కే, హ్యాండ్ బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కూడిన క్రీడామైదానం ఉన్నాయన్నారు. వెంకటయ్య, జ్యోతి, కనీఫ్ ఫాతిమా, రమేష్, మున్ని, అభిలాష్, భాస్కర్, శేఖర్, సుమలత, భావన పాల్గొన్నారు.

‘సమస్యల పరిష్కారంలో విఫలం’



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

గోవిందరావుపేట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని గ్రామ పంచాయతీ వర్కర్స్ మండల కమిటీ నాయకుడు గురుగు ఐలయ్య అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 20న కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. మండలంలోని కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఉప్పలయ్య, కుమారస్వామి, రాజు, విజయ, కుమార్, సంపత్, వెంకన్న, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

రమణక్కపేటలో పెసా గ్రామసభ

మంగపేట: మండలంలోని రమణక్కపేట గ్రామంలో గురువారం పంచాయతీ ప్రత్యేక అధికారి చందా భద్రయ్య, పంచాయతీ కార్యదర్శి కోరం రాజు ఆధ్వర్యంలో ఎంపీడీఓ భద్రునాయక్ అధ్యక్షతన రమణక్కపేట, గొల్లగూడెం రెండు ఇసుక రీచ్‌లకు పెసా గ్రామసభ నిర్వహించారు. మొత్తం 106 గిరిజన ఓటర్లు ఉండగా గ్రామ సభకు 88 మంది హాజరై రమణక్కపేట, గొల్లగూడెం ఇసుక రీచ్‌ల నిర్వహణ బాధ్యతలను రిజిస్టర్ సొసైటీ అయిన కొమరం భీం ఎస్టీ ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘం లిమిటెడ్‌కు అప్పగించడానికి చేతులు ఎత్తి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పెసా మొబిలైజర్ పోలేబోయిన యశ్వంత్, పెసా కార్యదర్శి గొంది ప్రసాద్, ఉపాధ్యక్షుడు సముద్రాపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ భళా..



కాటారం: పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా సరస్వతి(వీఐపీ) ఘాట్ సమీపంలో ఫుడ్ కోర్టు, స్టాల్స్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటుంది. పట్టణ ప్రాంతంలో విధంగా భారీ స్థాయిలో చిన్న పిల్లలకు సంబంధించిన క్రీడా పరికరాలు, ఏయిర్ గేమ్ జోన్ సామగ్రి ఏర్పాటు చేశారు. దీంతో చిన్న పిల్లలు ఎగ్జిబిషన్ లో ఆడుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.



పుష్కరస్నానం ఆచరించిన గండ్ర జ్యోతి



చిట్యాల: సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలోని పుష్కర ఘాటు వద్ద బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి తన బంధువులతో గురువారం పూజ కార్యక్రమం నిర్వహించి పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం



కాటారం: కాళేశ్వరంలో అత్యంత అట్టహాసంగా నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో అక్కడక్కడ అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తుంది. సరస్వతి(వీఐపీ) ఘాట్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై టెంట్‌సిటీకి సమీపంలో భారీ గుంత ఉండటంతో అధికారులు పెద్ద కర్ర దుంగను ఆ గుంతలో నాటారు. ఆ కర్ర ప్రమాదకరంగా ఉండటంతో పాటు అక్కడ ఎలాంటి హెచ్చరిక సూచిక ఏర్పాటు చేయలేదు. వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో వాహనాలు ఆ కర్రను గమనించక ఢీ కొడితే ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి కర్రను తొలిగించి ప్రమాదాల నివారణ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

రోడ్డుపైకి లీకేజీ నీరు..



కాటారం: కాళేశ్వరంలో సరస్వతి(వీఐపీ) ఘాట్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై లీకేజీ నీరు ప్రవహిస్తుంది. తాగునీటి సరఫరాకు సంబంధించిన పైప్‌లైన్ పగిలి నీరు పైకి వచ్చింది. దీంతో రహదారి కొంత దూరం నీటి మయంగా మారిపోయింది. సుమారు మూడు గంటల పాటు లీకేజీ నీరు రోడ్డు పైకి రాగా వాహనాలు, భక్తులు నీటిలో నుంచి వెళ్లడంతో రోడ్డు బురదతో నిండిపోయింది. అటు వైపుగా సంబంధిత అధికారులు, సిబ్బంది రాకపోకలు సాగించినప్పటికీ లీకేజీకి మాత్రం మరమ్మతులు చేపట్టలేదు.

మావోయిస్టు చందు అంత్యక్రియలు

- వారం క్రితం కర్రెగుట్ట ఎదురు కాల్పుల్లో మృతి
- ఛత్తీస్‌గఢ్‌కు తరలింపు
- స్వగ్రామం ఏటూరుకు ఆలస్యంగా తీసుకువచ్చిన పోలీసులు



మావోయిస్టు చందు (ఫైల్)



రోదిస్తున్న చందు కుటుంబ సభ్యులు



అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: కర్రెగుట్టల్లో వారం రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో కన్నాయిగూడెం మండలం ఏటూరు గ్రామానికి చెందిన సాదనపల్లి చందు (24)అలియాస్ నీరజ్, రవి మృతి చెందాడు. అన్నపూర్ణ, వెంకటేశ్వర్లు దంపతుల రెండో కుమారుడైన చందు ఇంటర్ వరకు చదువుకొని భద్రాచలంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ మావోయిస్టు పార్టీకి ఆకర్షితుడై ఉద్యమంలోకి రెండేళ్ల క్రితం వెళ్లాడు. ఈ క్రమంలో వారం రోజుల కిందట కర్రెగుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చందు మృతి చెందాడు. మావోయిస్టు పార్టీలో బెటాలియన్ డాక్టర్ టీం కమాండర్‌గా దామోదర్ రైట్ హ్యాండ్‌గా చందు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అతడిపై రూ.8 లక్షల రివార్డు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే చందు వివరాలు పోలీసులకు తెలియకపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపురం ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో మృతదేహాన్ని భద్రపర్చారు. అక్కడి పోలీసులు తెలంగాణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సాయంతో మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు చందు మృతదేహాన్ని పోలీసులు ఛత్తీస్‌గఢ్ నుంచి ఏటూరుకు తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించగా అశ్రునయాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతం అయ్యారు.. ఏటూరు గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది.

సంపాదిస్తనని చెప్పి.. సచ్చిపోతివా బిడ్డా

తండ్రి వెంకటేశ్వర్లు లోటును తీర్చి కుటుంబానికి తోడుగా ఉంటానని, డబ్బు సంపాదిస్తావని చెప్పిపోయి సచ్చిపోయి అత్తివా బిడ్డా అంటూ మావోయిస్టు చందు తల్లి అన్నపూర్ణ ఆర్తనాదాలు చూపరులను కన్నీళ్లు పెట్టించాయి.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరసింహనాయక్

గోవిందరావుపేట: వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను గురువారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నరసింహ నాయక్ మాట్లాడుతూ.. 20 రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతుందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చిన ధాన్యాన్ని ఎటువంటి కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వమే బాధ్యత వహించి కొనుగోలు చేయాలని అన్నారు. నాయకులు పోరిక గోవింద్‌నాయక్, చుక్క గట్టయ్య, రేండ్ల శ్రీనివాస్, గూడూరు శ్రీనివాస్, బైకాని ఓదేలు, గోద కనకయ్య, దూడల రమేష్, పెద్దపురం రవి, అలుగం సమ్మయ్య, మద్దినేని వెంకన్న, నల్లెల కృష్ణమూర్తి, చాగర్ల స్వప్న, చెల్పూరు భాగ్య, దూడల సతీష్, కొంరాజులు చిన్ని, ఎర్రం కుమార్ పాల్గొన్నారు.

నేటినుంచి సమ్మర్ క్యాంపు

మల్హర్: మండలంలోని తాడిచర్ల జిల్లాపరిషత్ పాఠశాలలో నేటి (శుక్రవారం) నుంచి ఈనెల 28 వరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం తిరుపతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్యాంపులో విద్యార్థులకు వివిధ అంశాలు ఫిజికల్ హెడ్యూకేషన్, మ్యూజిక్, సాంగ్స్, డ్రాయింగ్, పేయింటింగ్, స్పోకన్ ఇంగ్లీష్‌లతో పాటు పలు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 8.00 గంటల నుంచి 11.00 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 6 నుంచి 10 తరగతి విద్యార్థులను సమ్మర్ క్యాంప్‌కు పంపించాలని కాంప్లెక్స్ పరిధిలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆయన కోరారు.

సడాలమ్మ జాతర ప్రారంభం



వనం తీసుకువస్తున్న పూజారులు



పూజలు చేస్తున్న పూజారులు



ఆలయానికి తీసుకోస్తూ..



సడాలమ్మను తీసుకొస్తుండగా ఆహ్వానిస్తున్న గ్రామస్తులు, భక్తులు

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడి గ్రామ సమీపంలో గురువారం సడాలమ్మ జాతర ఘణంగా ప్రారంభమైంది. ఈ జాతరను బందాని వంశస్తులు నిర్వహిస్తున్నారు. గిరిజన సాంప్రదాయ పద్ధతుల్లో సన్నాయి వాయిద్యాల నడుమ ఉదయం 8గంటలకు గ్రామ సరిహద్దులో ఉన్న ముకిరిసరి గుట్టపైకి తలపతి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వనదేవత సడాలమ్మను తీసుకొస్తుండగా గ్రామస్తులు, భక్తులు సాదరంగా ఆహ్వానిస్తూ నీల్లారబోసి మొక్కారు. సడాలమ్మతో తలపతి ఆలయానికి చేరుకోగానే అమ్మవారిని ప్రతిష్ఠించారు. తెల్లవార్లు గుడి ప్రాంగణంలో గిరిజన నృత్యాలతో జాతర తంతును నిర్వహించారు. నేడు ఉదయం నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీస్ స్టేషన్‌లో నాయకులు

టేకుమట్ల: కాళేశ్వరం పుష్కరాల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్, బీఎస్పీ ఈసీ సభ్యులు సంగి రవిలను గురువారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాల నోరు నొక్కడం ఎంత వరకు సమంజసమన్నారు. పాలన పక్కన పెట్టి ప్రపంచ అందెగత్తెల పోటీలకు సమయం కేటాయించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రజలను, ప్రజాసమస్యలపై దృష్టి సారించాలన్నారు.